ఓంశ్రీసాయిరాం

నరజన్మమునందు పుట్టి నరజన్మమునందు పెరిగి
నరసింగములైనవారు తొలిసంగతి మరచినారు
మలిన దేహము పెంచి అసురత్వము స్వీకరించి
సమరాలను స్వాగతించి శాంతి సభలు జరుపుతారు.

ఈనాటి ఆధునిక యుగప్రభావము యీరీతిగా నున్నది. మానవ సమాజములో ప్రధానముగా వుండవలసినది మానవత. ఎంతటి మేధావి అయినా, ఎంతటి సైంటిస్ట్ అయినా, ఎంతటి విద్యావంతుడైనా వాటితోబాటు మానవత్వాన్నికూడా అభివృద్ధిగావించు కోవాలి. మానవతనే కోల్పోయిన ఎన్ని శక్తులుండినప్పటికి, ఎన్ని విద్యలుండినప్పటికి, యివన్నీ కేవలమూ నిరర్థకములే! ఏ మానవుడు ఈ మానవత్వాన్ని అభివృద్ధిగావించుకొనునో అప్పుడే సమాజము, దేశము, విశ్వము మానవత్వముతో విరాజిల్లుతుంది. ఈ మానవత ఒక్క ఆధ్యాత్మికమునందు మాత్రమే అభివృద్ధి చెందునుగానీ అన్యమార్గములలో ఈ మానవత్వము అభివృద్ధిచేసుకోలేము. విత్తనము భూమిలో పెట్టి నీరు పోసినప్పుడే అది ఒక మొక్కగా వచ్చి, వృక్షముగా ఏర్పడగలదు. అదే విత్తనము టిన్నులో పెట్టి, నీరుపోస్తే కుళ్ళిపోతుంది. కనుక, మానవతా విలువలు ఆధ్యాత్మికమునందు మాత్రమే అభివృద్ధికాగలవు. కనుక, మానవుడు మానవత్వాన్ని అభివృద్ధిగావించుకోవలెనన్న మొట్టమొదట హృదయమునందు ఆధ్యాత్మికమనే ఎరువు వేసి, ప్రేమ అనే జలమును పెట్టి మానవతా విలువలు అభివృద్ధిగావించుకోవాలి.

మానవ జీవితములో నిత్యసత్యముగా ప్రకాశించే ప్రాచీన సంస్కృతిని కాలానుగుణ్యముగా అభివృద్ధిగావించుకోటం అనుస రించినప్పుడే మానవత్వము వికసిస్తుంది. మానవ జీవితములో సమగ్రత, సమైక్యత అత్యవసరము. ఈ సమగ్రత, సమైక్యత రెండూ వుండినప్పుడే మానవత్వము మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ మానవతా విలువలు ఎక్కడనుంచి పొందాలి? ఏవిధముగా మనము అభివృద్ధిగావించుకోవాలి? ఈ మానవతా విలువలు మానవునితో జన్మించాయి. మానవునితోబాటు మానవతా విలువలు చేరి వుంటున్నాయి. మానవునకు, మానవతా గుణములకు ఏమాత్రమూ వేరుబాటు లేదు. ఇది అవినాభావ సంబంధము. అట్టి అవినాభావమైన మానవత్వమును ఈనాడు విస్మరించి మానవునిగా మాత్రమే జీవించాలని ప్రయత్నిస్తున్నాడు. ఆధ్యాత్మిక మార్గములో అష్టవిధములైన సాధనలుంటున్నాయి. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అని. అష్టైశ్వర్యములుగా వుంటున్నాయి.

ఇందులో మొట్టమొదటిది యమ. ఇది ఒక్కటి గర్తించుకుంటే చాలు. ఇందులోనే సర్వమానవతా విలువలు వుంటున్నాయి. మానవత్వమంతా యిందులోనే యిమిడివుంటున్నాది. యమ అనేదానిలో పంచప్రాణములుంటున్నాయి. ఇందులోనే పంచకోశము లుంటున్నాయి. ఇందులోనే పంచతత్త్వములుంటున్నాయి. ఇందులోనే పంచరూపములుంటున్నాయి. ఈ పంచరూపములే గాయత్రి స్వరూపము అని. అవియే అహింస, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము. ఈ ఐదూ యమములో చేరివున్నాయి.

మొదటిది అహింస. దీనిని బౌద్ధమతములో ప్రధానముగా బుద్ధుడు బోధిస్తూవచ్చాడు. ఇదియే ప్రథమ ధర్మమని నిరూపిస్తూ వచ్చాడు. అహింసా పరమోధర్మః అన్నారు. ఈ అహింస అనగా ఏమిటి? ఇతరులను బాధించటము, ఇతరులను కష్టపెట్టటము, ఇతరులను హింసించటము, ఇతరులను నొప్పించటము, ఇతరులను మాత్రమేకాదు ఇతరులను బాధించకూడదని అన్నంత మాత్రమున అది అహింస అని చెప్పటానికి వీలులేదు. అహింస అనగా ఇతరులను బాధించకుండా వుండటమేగాక తనను తాను బాధించుకోకుండా చూచుకోవాలి. తనను తాను బాధించుకొన్నవాడు ఇతరులను బాధించక తప్పదు. మొట్టమొదట అహింసా ధర్మమును ఆచరణలో పెట్టదలచిన వ్యక్తి తననుతాను హింసించుకోకుండా చూచుకోవాలి. ఇది ఏవిధముగా? తన నడతయందు సరైన మార్గమున్నదా లేదా అనే విచారణ చేసుకోవాలి. అదికూడా అహింసయే. వాక్కునందుకూడా ఇది పరులను బాధించే వాక్కా లేదా అని విచారణ సల్పాలి. తన చూపులను దుర్మార్గమైన, దుష్టసంకల్పముతో కూడిన చూపులు ప్రవేశించకుండా చూచుకోవాలి. చెడు విషయములను వినకుండా చూచుకోవాలి. ఇవన్నీ తననే బాధిస్తున్నాయి. కనుకనే, చెడ్డచూపులేకుండా, చెడ్డమాటలు వినకుండా, చెడ్డమాటలు లేకుండా, చెడ్డతలంపులు లేకుండా, చెడ్డపనులు చేయకుండా చూచుకోవాలి.

చెడ్డ అనగా ఏమిటి? కేవలం మన conscience కి వ్యతిరేకంగా ప్రవర్తించటమే చెడ్డ. ఈ conscience కి విరుద్ధముగా మనము నడచుకున్నప్పుడు ఇందులో అన్నీకూడా మనకు చెడుపులే జరుగుతాయి. కనుక, ఈ conscience మనలోనున్న దైవ స్వరూపము. ఏ పని చేసినా ఇది సరికాదు, ఇది సరి అని నిర్ణయం చేస్తుంది. అయితే ఈ conscience విచారణ చేయటానికి కొంతకాలం తీసుకోవాలి. ఇందులో తొందరపాటు పనికిరాదు. ఏదైనా ఒక మాట అనాలనుకున్నప్పుడు కొంత యోచించి 'ఇది తప్పా, ఒప్పా? ఇది మంచా, చెడా?' అని విచారణచేసి ఆ మాటలో ప్రవేశపెట్టాలి. ఏదైనా ఒక విషయాన్ని వినాలనుకున్నప్పుడు 'ఇది మంచిదా, చెడ్డదా? ఇది నాకు సరియైనదా, కాదా?' అనే విచారణ చేసుకుంటూ నిర్ణయం తీసుకోవాలి. కేవలం ఈ పంచభూతములతో అనుభవించేది మాత్రమే కాకుండా భుజించే విషయములోకూడా జాగ్రత్తగా వుండాలి. అతిగా భుజించటంకూడా

హింసగా వుంటుంది. కనుక, మితంగా భుజించినప్పుడే మనకు హాయి చేకూరుతుంది. కనుక, మనకు సుఖమునిచ్చేదే అహింస. తనను బాధించనదే అహింస. అంతేకాదు. త్రాగే నీరుకూడా సరైన పరిస్థితిలో మితంగా వుండాలి. అదేవిధంగా మన జీవితమంతా అహింసామయంగా వుండాలి. మనం స్నానంచేసే సమయంలో అనేక క్రిములు మరణిస్తుంటాయి. మనం నడచే నడకలో అనేక చీమలు మరణిస్తుంటాయి. మనం చేసే పనులలో అనేక క్రిములు నశిస్తుంటాయి. ఇవన్నీకూడా హింసతో కూడినవే. అందువలనే ఈ హింస మనలను బాధించకుండా చూచుకోవాలనుకున్నప్పుడు 'సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావముతో మనం ఆచరిస్తూ రావటం వల్ల ఈ హింస మనలను బాధింఛదు. అట్లని మనం తెలిసికూడా బాధించి, ఇది 'సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం' అంటే ప్రయోజనం రీదు. ఈ conscience ను వేదాంత పరిభాషలో 'చిత్' అన్నారు. ఈ చిత్‌నే ఎవేర్‌నెస్ అన్నారు. అనగా పరిపూర్ణముగా గుర్తించటమే. total understanding చేసుకోటం. మన మనసునందే వుంటున్నది. ప్రతి మానవుడు యిట్టి పరిపూర్ధ స్థితి అందుకోటానికి తగిన కృషి చేయాలి. కనుక, అహింస మానవునిలోని మొట్టమొదటి ధర్మము.

రెండవది సత్యము. ఈ సత్యమనగా ఏమిటి? చూచినది చెప్పటము, వినింది చెప్పటము, చెప్పినది చెప్పటము, చేసింది చెప్పటము అంతమాత్రమే కాదు. ఇదంతా కేవలము ప్రాకృతమైన సత్యము. నిజంగా హృదయపూర్వకంగా నీ conscience తృప్తిగా నీవు మాట్లాడటం సత్యంగా అన్వయిస్తుంది. దీనినే 'ఋతమ్' అని చెప్పవచ్చును. ఇది త్రికాలాబాధ్యం. ఇది మూడు కాలములందు మారనిది. దేశకాల పరిస్థితుల ప్రభావములకేమాత్రమూ లొంగనిది. మారిస్తే మారేది కాదు. దీనిని ఏవిదంగా దాచినా దాగేది కాదు. సత్యం సత్యప్రధానము. కనుక, 'సత్యంజ్ఞానమనంతంబ్రహ్మ'. ఈ సత్యము దైవస్వరూపమే. కనుక, సత్యము ప్రధానమైన రెండవ మానవతా విలువ.

మూడవది ఆస్థేయము. ఆస్తేయమనగా ఏమిటి? ఆస్తేయమనగా పరుల వస్తువులు అపహరించకుండా వుండటము. ప్రోపరిటీ అంటే కోవలం ఒక బుక్కో, పెన్నో యింకేపదార్థమైనా కావచ్చు. ఏదైనా నీకవసరమైనప్పుడు ఆ వస్తువుయొక్క యజమాని యొక్క పర్మిషన్ తీసుకోవాలి. అట్టి పర్మిషన్ లేకుండా ఆ వస్తువును తీసుకోటం దొంగతనము క్రిందనే వస్తుంది. పరుల విషయంలో కొంత విమర్శించటం, అతనికి బాధకలిగేటట్లుగా ప్రవర్తించటం. దొంగతనమంటే ఏమిటి? ఏదో పదార్థాన్ని మనం అందుకోటం. వస్తువులకు యజమాని వునిటున్నాడు. ప్రతి పదార్థమునకు ఒక యజమాని వుంటున్నాడు. ఆ యజమాని అనుమతి పొంది మనం అనుభవించాలి. ఇది చాలా వరకు పిల్లలో జరుగుతుంది. ఒకని కెమేరా తీసుకొని యింకొకడు ఫొటోలు తీస్తుంటాడు. అయితే కెమేరా యజమాని పర్మిషన్ తీసుకొని దీనిని ఉపయోగించవచ్చు. పర్మిషన్ తీసుకొని ఉపయోగించినా అదేమైనా చెడిపోతే ఆ బాధ్యత నీకొస్తుంది. కాబట్టి, ఆ కెమేరాను పాడుచేయటం ఒకవిధంగా ద్రోహం చేయటమే అవుతుంది. ఈవిధంగా నిత్యజీవితంలో ఏ చిన్నవిషయం అయినా అనేకరకములుగా విచారణ చేసినప్పుడు ఈ ఆస్థేయము ప్రత్యక్షంగా గోచరిస్తుంది. అనగా పరుల వస్తువులు మనము తీసుకోకూడదు. పర్మిషన్‌తో తీసుకున్నప్పటికీ పొరపాట్లు రావచ్చును. కొన్ని చెడిపోవచ్చును. తద్వారా నీ మనస్సుకు కష్టం కలగవచ్చు. తద్వారా ఆ యజమానికి కూడా కష్టం కలిగించవచ్చు. ఈ కష్టం కలిగించటం తిరిగి అహింస క్రిందనే వస్తుంధి. అన్నింటికి ఒకదానికొకటి సంబంధబాంధవ్యముంటున్నది. ఎవరి వస్తువు మనము తీసుకోరాదు. ఒకవేళ మీకవసరమైతే వారి పర్మిషన్ తీసుకొని నీవు అనుభవించవచ్చును. ఆ వినియోగంకూడా సరైన రీతిలో వుండాలి. అట్లు సరైన వినియోగం చేయకుండా వుండినప్పుడు ఆ వ్యక్తికి కొంత కష్టం కలిగించినవారమౌతాము. ఆస్తేయము మానవుని ప్రధానమైన మూడవ మానవతా విలువ.

ఇక బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యమనగా లోకంలో అనేకమంది అనేకరీతులుగా ఊహిస్తూ వుంటున్నారు. వివాహము చేసుకోకుండా వుండటము బ్రహ్మచర్యమనుకుంటారు. అదికాదు నిజమైన బ్రహ్మచర్యము. ఇది లోకసంబంధమైన బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యమనగా బ్రహ్మలో చరించటమే. 'చర్య' అనగా ప్రవర్తన. బ్రహ్మములో చరించటమే బ్రహ్మచర్యము. కనుక, కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు దేహసంబంధమైన రీతిలో కల్పించుకోటం బ్రహ్మచర్యమనిపించుకోదు. వివాహము చేసుకోకుండా వున్నంతమాత్రమున బ్రహ్మచర్యము కాదు. అవివాహితుడు అంటారు అంతే. వివాహం చేసుకుంటే అతనిని గృహస్థు అంటారు. గృహస్థ ధర్మంలోకూడా బ్రహ్మచర్యముంటుంది. అనగా గృహస్థు తన అర్ధాంగితో మాత్రమే తన జీవితము గడపటం, అదికూడా బ్రహ్మచర్యమే. అట్లు కాకుండా పెడమార్గములో మనస్సును ప్రవేశింపచేస్తే అది బ్రహ్మచర్యము కానేరదు. కనుక, గృహస్థ ధర్మంలోకూడా బ్రహ్మచర్యం చెడిపోతుంది. శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా ఎట్టి పెడమార్గములకుగానీ, తలంపులకుగానీ అవకాశము ఇవ్వకూడదు. ప్రాచీన మహర్షులందరూ ఈవిధమైన మార్గమును అవలంబించటం చేతనే అనాదినుండి ఈ మానవతా విలువలు మానవత్వమునకు ప్రధానమైన ప్రాణములుగా పోషిస్తూ వచ్చారు. బ్రహ్మచర్యమనేదానిలో చాలా అంతరార్థము యిమిడి వుంది. మీకు తెలియకుండా అనేక కష్టనష్టములు జరుగుతుంటాయి. మన ఎనర్జీని వేస్టు చేస్తుంటాము. ఇదంతా బ్రహ్మచర్యమునకు విరుద్ధమైన మార్గమే. బ్రహ్మచర్యము విషయములో ఇంద్రియనిగ్రహము తగిన పటుత్వంగా వుండాలి మనకు. ఇంద్రుని జయించటము సులభమేమోగాని ఇంద్రియములను జయించటము అంత సులభము కాదు. ప్రాచీనకాలమునుండి భారతీయులు యిలాంటి పవిత్ర సాధనలు సలుపుతూ రావటంచేత భారతదేశములో ఇలాంటి ధర్మములు ఈనాటుకికూడా ఏవిధమైన అపకారం

లేకుండా అనుభవిస్తూ వస్తున్నారు. నిజంగా భారతదేశమునకు కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు ఎన్నో జరిగాయి. కాని, ఎన్ని జరిగినప్పటికీ ఈ మానవతా విలువలు అనాదికాలమునుండి కాపాడుకుంటూ, పోషించుకుంటూ, రక్షించుకుంటూ వచ్చారు.

ఐదవది అపరిగ్రహము. ఇతరులనుండి మనము ఏ పదార్థమునూ అందుకోకూడదు. లోకములో తల్లి, తండ్రి వున్నారు. తల్లిదండ్రుల దగ్గర అందుకోటానికి నీకు అధికారం వుంది. తల్లిదండ్రులకు నీవు ప్రతిబింబ స్వరూపుడవు. కనుక, ఆ తల్లదండ్రులు ఏది యిచ్చినా నీవు అందుకోటం ధర్మమే. అపరిగ్రహములో సూక్ష్మమైనవి వుంటున్నాయి. అత్తమామలు యిచ్చినా పుచ్చుకోకూడదు. ఇంతేకాదు, బ్రదర్స్ యిచ్చినా పుచ్చుకోకూడదు. ఒకవేళ పుచ్చుకొన్నప్పటికీ, దానికి బదులు నీవు యింకొకటి యిచ్చుకోవాలి. లోకములో ఈ పరిగ్రహము మితిమీరిపోతున్నది. మీరు విద్యనభ్యసించి, ఉన్నతస్థాయి పొంది, వివాహమాడినప్పుడు యింత వరకట్నమని తీసుకుంటున్నారు. ఇది చాలా తప్పు. పరిగ్రహమనేదాన్ని మీరు తీసుకుంటే దానిలో చాలా పాపం వుంది. అపరిగ్రహము, మీరు ఏమీ ముట్టుకోకుండా వుండాలి. తమ బిడ్డలను ఇరవై, ఇరవైరెండు సంవత్సరములు పెంచి, పెద్దచేసి, అభివృద్ధిగావించి, విద్యాబుద్ధులు నేర్పించి కట్టకడపటికి నీ చేతికి యిచ్చారు. అదే పెద్ద గిఫ్ట్. ఆ బిడ్డతోబాటు తిరిగి ధనం ఎందుకు నీకు? ఆ తల్లిదండ్రులు ఆ బిడ్డకేమైనా యిచ్చుకోనీ, ఆ బిడ్డకు తల్లిదండ్రులు యిచ్చుకోటంలో ఏ దోషం లేదు. నీవు పుచ్చుకోటం చాలా తప్పు. ఈవిధమైన తృప్తిని మనం పొందుతూ రావాలి. అలా తృప్తిని పొందలేనప్పుడు పరిగ్రహమవుతుంది. సరైనరీతిలో, మనము వేదప్రమాణంగా అనుసరించామంటే ఇలాంటి ధర్మాలకు విరుద్ధంగా ప్రవర్తించటంచేత మనకు తెలియమి బాధలు, తెలియని కష్టములు, తెలియని దుఃఖములు మనలను ఆవరిస్తున్నాయి. అయితే తల్లదండ్రుల దగ్గర, గురువు దగ్గర, దైవము దగ్గర వీనికి మాత్రం exemption వుంది. తల్లిదండ్రుల దగ్గర ఏమైనా పుచ్చుకోవచ్చు. ఎందుకనగా వారియొక్క ప్రతిబింబమే నీవు. వారినుండి వచ్చినవాడవని నీవు భావిస్తున్నావు. కాదు. వారి ద్వారా వచ్చావు నీవు ఈ జగత్తుకు. కనుక, వారి ద్వారా ఏమైనా పొందవచ్చు. పుత్రుడు తండ్రికి ఆత్మస్వరూపుడే. కనుక, తల్లదండ్రుల దగ్గర తీసుకోటంలో ఎట్టి దోషమూ లేదు. అయితే తల్లిదండ్రుల దగ్గర పోట్లాడి, కోర్టుకు పోయి, ఇంకేవిధమైన వ్యవహారములు జరిపి తీసుకోకూడదు. తల్లిదండ్రులు ప్రీతిపూర్వకంగా యిచ్చినది తీసుకోవాలి. నాకు right వుందికదాయని fight చేయకూడదు. చేయటం పరిగ్రహము.

ఈ అపరిగ్రహము ఎంతో పవిత్రమైనది. తల్లిదండ్రుల దగ్గరైనా కొంత లిమిట్ వుంది. కాని, దైవము దగ్గర లిమిట్ లేదు. ఏది యిచ్చినా పుచ్చుకోవచ్చు. ఎందుకంటే అన్నింటికీ అధిపతి తానే. అన్నింటికీ తాను తగిన శక్తిమంతుడు. ఈ పరిహారంకూడా తాను చేయగలడు. దుఃఖనివారణకూడా గావించగలడు. కనుక, ఏదైనా పుచ్చుకోటానికి అధికారం వుంది.

త్వమేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ.

అంతా తానే అయినప్పుడు అత్త, మామ, తల్లి, తండ్రి ఇవన్నీకాదు ప్రత్యేకంగా. భగవంతుని మీరు తల్లి, తండ్రి అనే భావంతో భావించకూడదు. తల్లి అంటే నీకంటే ప్రత్యేకమైపోతుంది. తండ్రి అంటే నీకంటే ప్రత్యేకమైపోతాడు. ఈ సంబంధభాంధవ్యములు భగవంతుని దగ్గర భావించరాదు. నీవేనేను, నేనేనీవు. అంతేగాని, తల్లి, తండ్రి అనే సంబంధము కొంతవరకు బంధుత్వాన్ని కలిగిస్తుంది. ఈ బంధనచేతనే మరికొన్ని బాధలు కల్గుతాయి. అందరు పుట్టినది ఒకే స్థానమునుండి. వివిధ రూపనామములుండినప్పటికీ అందులో అందరికీ ఏకత్వమనే ఆత్మ అనే తత్త్వము వుంటుంది. దీనికి చిన్న ఉదాహరణము.

అనంత సముద్రములో అసంఖ్యాకమైన అలలు ఉద్భవిస్తుంటాయి. ఒక అల వుండినట్లుగా మరొక అల వుండదు. ఒక్కొక్క అల ఒక్కొక్క తీరుగా వుంటుంది. ఒక్కొక్క అల ఒక్కొక్క రూపంగా వుంటుంది. అన్ని అలలు సముద్రములో ఒక్కటే. అదేవిధంగా సచ్చిదానంద సాగరమందు మానవజీవితములనే అలలు వేరువేరు రూపనామములతో వస్తూ వున్నాయి. కాని, ఈ రూపనామములందున్న సచ్చిదానందమనే సముద్ర జలము ఒక్కటే. ప్రతి మానవునియందు సచ్చిదానందము సహజముగా వుంది. ఈ సచ్చిదానందము కోసము మనము ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాము. ఇది మన అజ్ఞానము. అజ్ఞానము నుండి అవివేకము, అవివేకము నుండి అహంకారము, అహంకారము నుండి రాగము, రాగము నుండి ద్వేషము, ద్వేషము నుండి కర్మ, కర్మ నుండి జన్మ. మన జన్మకు మూలకారణం కర్మ. కర్మకు మూలకారణం ద్వేషము, ద్వేషమునకు మూలకారణం రాగము, రాగమునకు మూలకారణం అహంకారము, అహంకారమునకు మూలకారణం అవివేకం, అవివేకానికి మూలకారణం అజ్ఞానం. అన్నీ అజ్ఞానం నుండే ఆవిర్భవిస్తున్నాయి. ఈ అజ్ఞానమంటే ఏమిటి? భిన్నత్వముతో కూడినదే అజ్ఞానం. అది వేరు, నేను వేరు అనే భిన్నత్వమే అజ్ఞానము. అంతా దైవముయొక్క అంశయే. అగ్ని మండుతూ వుంది. అగ్నికణములు కొన్ని లేచిపోతుంటాయి. అగ్నికణములు అగ్నినుండి ఆవిర్భవించినవే. అయితే అగ్నికి సమీపంలో వున్నంత కాలము అగ్నిలోనున్న గుణములు అన్నీ అణువులో వుంటాయి. ఈ అణువులో కొంత దూరం పోతే అగ్ని ఆరిపోతుంది. బొగ్గుగా తయారౌతుంది. అదేవిధముగా భగవంతునికి సమీపంగా వున్నంత కాలమూ ఆ భగవంతునిలో వుండే సచ్చిదానంద గుణములు యిందులో కూడా వుంటాయి. ఈ అగ్ని కణములు దూరంగా పోతే బొగ్గుగా

మారిపోతుంది. వాటి ప్రకాశము ఆగిపోతుంది. ఈ అగ్ని నుండి దూరంగా పోతే బొగ్గుగా మారిపోతుంది. వాటి ప్రకాశము ఆగిపోతుంది. పేరు మారిపోతుంది. వారే అజ్ఞానస్వరూపులు.

గ్రంథాలు నేర్చుకున్నంత మాత్రమున, శాస్త్రములు తెలుసుకున్నంత మాత్రమున జ్ఞానులు కారు. జ్ఞానమంటే ఏమిటి? అద్వైత దర్శనం జ్ఞానం. ఏకాత్మభావంతో వుండేది జ్ఞానం. ప్రతిఒక్కటీ మనయందే వుంటున్నది. ఆ సచ్చిదానందము నీయందే వుంటున్నది.ఆ ఆనందమునకు సత్, చిత్‌లను అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడే 'వ్యక్తి' అనే పేరు సార్థకమౌతుంది. అక్కడ వ్యక్తి వున్నట్లుగా కనిపిస్తుందంటావు. అందరికీ ఆ 'వ్యక్తి' అనే పదం సమన్వయం కాదు. వ్యక్తి అనే పదము ఎంత విలువైనది! కాని, ఈ విలువను మనం తెలుసుకోకుండా వ్యక్తి అని పిలిచి, ఈ పవిత్రమైన పదమును ఉపయోగపరుస్తున్నాము. ఎట్టి పదములుగాని మనం తెలుసుకొని ఉపయోగించాలి. వ్యక్తి అనగా ఎవరు? అవ్యక్తంగా, అగోచరంగా మనయందున్న ఆత్మశక్తిని ఎవరు వ్యక్తీపరింపచేస్తే వాడు మాత్రమే వ్యక్తి. సచ్చిదానందము మనలోనే అవ్యక్తంగా వున్నాది. చాలా గూఢంగా వుటుంన్నాది. దానిని మీరు ఆవిర్భవింప చేసుకోవాలి. దాని ఆనందమును మనం అనుభవించాలి. అప్పుడే నీవు వ్యక్తిగా రూపొందుతావు.

సత్ అనగా being . చిత్ అనగా awareness .being అనగా ఎప్పటికీ ఒకేమాదిరిగా వుంటుంది. ఎప్పటికీ ఒకేలా వుండేది మాధుర్యము. చెక్కెరగాని, బెల్లంగాని నీటిలోవేసినా, పాయసంలో వేసినా, టీలో వేసినా, పాలలో వేసినా తీయగానే వుంటుంది. దేనిలో వేసినా ఆ తీయదనం పోవటంలేదు. కనుక, అది ఎప్పటికీ వుండేది, సత్. మీకోసం ప్రపంచస్థాయికి తీసుకువచ్చి ఉదాహరణ చెబుతున్నానుగాని చక్కెర అంటే సత్ కాదు. అర్థమవటంకోసం చెబుతున్నాను. ఇది ఎప్పుడూ తీయగానే వుంటుంది. దీని గుణము ఇది. క్వాంటిటీ ఎంతైనా క్వాలిటీ ఒకటే. అదే సత్. అది ఒక చేతిలో పెట్టుకొందాం. ఇంకొకటి చిత్. ఎప్పుడూ పరిపూర్ణ జాగురూకతతో వుండి కదలుతూ వుంటుంది. జలము. ఎందుకు దీనికి చిత్ అని పేరు పెట్టారు? ఇది కొండపై పోసినా క్రిందకే వస్తుంది గానీ పైకి వెళ్ళదు. ఎప్పుడూ కదలిపోతూనే వుంటుంది. జ్ఞానము అనేక రకములుగా మారదు. కాని, కదలుతూ వుంటుంది. కనుక, చిత్ అనేది జలము. సత్ చక్కెర, చిత్ జలము. ఈ రెండింటిని మనం కలిపినప్పుడు చక్కెర అనము, నీరు అనము, పానకము అంటాము. చక్కెర పేరు పోయింది. సిరప్ అని మూడవ పేరు వస్తుంది. సత్, చిత్ రెండూ కూడిన ఆనందము మనలో ఆవిర్భవిస్తుంది. ఈ ఆనందము మన విద్యలో నున్నదని భావిస్తున్నాము. వివాహములో వున్నదని భావిస్తున్నాము. ఉద్యోగములో వున్నదని భావిస్తున్నాము. పిల్లలలో, ఆస్తులలో ఆనందమున్నదని భావిస్తున్నాము. దీనిలో ఏమీ లేదు. మీరే చూడండి. నేను పరీక్ష ప్యాసైతే ఆనందమంటావు. ప్యాసైనావు. ఆనందము నిల్చిందా? తిరిగి పై చదువు చదవాలని చూస్తున్నావు. సీటు సాధించిన ఆనందమంటావు. ప్యాస్ చేశావు. ఆనందముందా? లేదు. ఉద్యోగము రావాలంటావు. ఉద్యోగము చిక్కింది. ఆనందము వచ్చిందా? రెండు, మూడు సంవత్సరాలలో ప్రమోషన్ రావాలంటావు. తిరిగి ప్రమోషన్ వచ్చాక ఆనందం వచ్చిందా? లేదు. వివాహం అంటావు. వివాహము చేసుకున్నావు, ఆనందం వచ్చిందా? లేదు. కుమారుదు కావాలంటావు. కుమారుదు కలిగాడు. ఆనందం వచ్చిందా? లేదు. వాడికి ఆస్తిపాస్తులు సంపాయించాలంటావు. సంపాదించావు. ఆనందం వచ్చిందా? కుమారునికి నీకు విరుద్ధభావం ఏర్పడింది ఆస్తిలోపల. ఇవన్నీ తాత్కాలికమైన ఆనందములే. మనకు ప్రాకృత సంబంధమైన వస్తువులతో సంబంధబాంధవ్యములు కలిగించేది ఆనందం కాదు. పరమాత్మతో కూడిన ఆనందము శాశ్వత ఆనందం. happiness is union with God. ఈ సత్యాన్ని పిల్లలు గమనించుకోలేక ఈ ప్రాకృతమైన ఆనందములకోసమని, సుఖాలకోసమని ప్రాకులాడుతున్నారు. మనస్సు పరిపక్వస్థితికి వచ్చినప్పుడే అది గుర్తించటానికి వీలవుతుంది.

వేసవిలో ఈ నేల ఎంత చక్కగా వుంటుంది. ఒక్క మొక్కకూడా వుండదు. బీచ్‌కి వెళ్ళి చూస్తే చక్కని యిసుక వుంటుంది. రెండవ దినం వర్షం వస్తే, మూడవ దినం పచ్చని గడ్డి మొలుస్తుంది. గడ్డి ఎక్కడనుంచి వచ్చింది? నిన్న లేదే. ఈ రోజు ఎలా వచ్చింది? నిన్నకూడా వుంది విత్తనరూపంలో. ఈనాడు మొక్కరూపం ధరించింది. అదేరీతిగా మనలో సత్‌చిత్‌ఆనందము ఒక విత్తన రూపంలో వుంటున్నాయి. సచ్చిదానందములు లేవే అని దిగ్భ్రాంతి పొందుతున్నావు. దైవప్రేమ అనే జలం వర్షింపచేస్తే అక్కడనుండి ఆవిర్భవిస్తుంది. ఆ ప్రేమ అనే జలము అక్కడ పోసినప్పుడే సత్‌చిత్‌ఆనందమునే మొక్కలు ఆవిర్భవిస్తాయి. ఆ ప్రేమ మనం ప్రకృతిపై ప్రవహింపచేస్తున్నాం. అందువలనే ఈ ఆనందమునకు దూరమైపోతున్నాము.

ఈనాడు అనేకమంది సైంటిస్టులు ఎన్నో యంత్రాలు కనిపెడుతున్నారు. ఎన్ని శక్తులనో కనిపెడుతున్నారు. శాంతికి అతి దూరమైపోతున్నారు. వేదాంతము అర్థము చేసుకోలేకపోతున్నారు. తన తత్త్వము తాను గుర్తించుకోలేకపోతున్నారు. ప్రాకృతమైన పేరుకోసం ప్రాకులాడుతున్నారు. అందువల్ల నిజమైన ఆనందము తన దగ్గర వుండికూడా తాను అనుభవించలేకపోతున్నాడు. మనయందే సర్వానందములు వుంటున్నవి. మనయందే వుంది దైవత్వము. మానవతా విలువలు మనం పెంచుకున్నప్పుడే యివన్నీ గుర్తించటానికి వీలవుతుంది.

అష్టాంగయోగములలో 'యమ' అనేదాన్ని గుర్తిస్తే చాలు. మిగిలిన యోగములు యిందులోనే లీనమై వుంటున్నాయి. దీనిలో అహింస, సత్యము, బ్రహ్మచర్యము, ఆస్తేయము, అపరిగ్రహము అనే ఈ ఐదూ బహిః ప్రాణములుగా నిల్చి వుంటున్నాయి. విద్యార్థులు

మొట్టమొదట అహింసను గుర్తించాలి. ఈనాటి పరిస్థితులలో దీనినే అభివృద్ధి పరచాలి. ఈనాడు ఎక్కడ చూచినా అశాంతి, అల్లకల్లోలమే. మీ భావములు పరిశుద్ధంగా వుండటం లేదు. ఎందుకంటే గాలిలో వచ్చేవన్నీ మనలో చేరిపోతున్నాయి. చూడండి! గాలిలో సర్వశక్తులూ వుంటున్నాయి. మీకు తెలియదు. విద్యుత్ తరంగములు సర్వత్రా వుంటున్నాయి. ఇక్కడ రేడియో పెట్టి చూడండి. మీకేమీ వినిపించట్ లేదు. కాని, యిందులో మద్రాసు రేడియో స్టేషన్‌లో జరిగే ప్రోగ్రాములు ట్యూన్ చేస్తే సాక్షాత్ అదే వస్తుంది. ఆ పాట యిక్కడ వినిపిస్తుంది. మద్రాసునుండి యిక్కడకు రావాలంటే ఎంత టైము పడుతుంది. అక్కడ పాడుతున్నప్పుడే యిక్కడ క్షణంలో వస్తోంది. ఇదంతా ఎక్కడనుంచి వచ్చింది? శబ్దతరంగములుంటున్నాయి. విద్యుత్ తరంగములు. అదే తేజస్సు అన్నాము. అదే దైవస్వరూపము.

మీకింకా తెలియదు బంగారు. చాలామంది సైన్సులో గుర్తించి వుంటారు. శబ్దతరంగాలు మద్రాసునండి వస్తున్నాయి, సిలోన్‌నుండి వస్తున్నాయి, ఢిల్లీనుండి వస్తున్నాయి. ఎన్ని తరంగాలు వచ్చినాగానీ ఒకదానికొకటి వేరుగా వుంటున్నాయి. ఇదే భగవంతుని శక్తి. రహస్యంగా, సూక్ష్మంగా వుంది. అంతా స్వచ్చంగా వుంటుంది. ఎప్పుడది స్వచ్ఛంగా వుండదు? నీవు సరిగా ట్యూన్ చేయలేకపోయినప్పుడు న్యూస్ రాదు,న్యూసెన్స్ వస్తుంది. నీవు సరిగా ట్యూన్ చేయి. స్వచ్ఛంగా వినిపిస్తుంది. దీనినే ధ్యానం అన్నారు. అనగా దేహము ఒక రేడియో, మైండ్ ఒక ప్లగ్. మీరు ధ్యానంలో కూర్చుంటే ఎప్పుడూ లేని తలంపులంతా వస్తుంటాయి. ఉన్న స్థానాన్ని వదలి మార్కెట్‌కు వెడుతుంది యీ మైండ్. కారణం ఏమిటి? సరైన concentration చేయటం లేదు. concentration చాలా ముఖ్యము. concentration లేనప్పుడు జీవితమంతా వ్యర్థమైపోతుంది. walking, talking, thinking, eating, writing లోనే వుంటున్నాయి. అన్నింటికీ concentration వుండాలి. కనుక, టైము తీసుకొని ధ్యానానికి కాలము వ్యర్థము చేయనక్కరలేదు. it is a way of life. అయితే meditation కి ప్రయత్నం చేయాలి. మెడిటేషన్‌కి, కాన్సన్‌ట్రేషన్‌కి వున్న తేడా పిల్లలు తెలుసుకోవాలి. ఒక గులాబి మొక్క వుంది. దానిలో అనేక కొమ్మలున్నాయి. పుష్పాలున్నాయి. ప్రతి పుష్పమునకు ఒక ముల్లుకూడా వుంది. నీవు పుష్పాన్ని కోయాలనుకున్నప్పుడు కొమ్మలను, రెమ్మలను ప్రక్కకు నెట్టాలి. నీ thought ఆ flower పైనే పోవాలి. flower క్రింద thorn వుంది. ఆ thorn ను తప్పించుకొని flower ను కట్ చేయాలి. love is flower, lust is thorn. don't touch the thorn, cut the flower. concentration లో ఐదు senses చేరిపోతాయి. meditation is beyond senses. ఈ రెండింటికి మధ్య contemplation అని వుంది. cotemplation cross అయినప్పుడే meditation start అవుతుంది. సైన్సులో చెబుతారు. క్రిందినుండి పైకి పోవాలనుకున్నప్పుడు మధ్యలో ఒక పొర వుంది. దాని తరువాత ఈథర్ అని చెబుతారు. ఈ ఈథర్‌ను దాటినప్పుడు ప్రమాదము. 15 సంవత్సరముల క్రితము రష్యన్సు చంద్రమండలము పోవటంలో దాటారు. భూమినుండి గాలి వత్తిడి, ఈ పంచభూతములు వుంటున్నాయి. వీటిని దాటి పోతున్నారు. ఆ బోర్డరు దాటే సమయంలో ఫెయిల్ అయి చనిపోయారు. ఎందువలన? ఆ వాతావరణం వేరు. పంచభూతములతో కూడినవి అక్కడ ఏమీ వుండవు. చంద్రుని మీదకు పోయేవానికి అక్కడ కాలు పెడితే భూమి వుందా లేదా తెలియదు. అక్కడ తేలిక అయిపోతుంది శరీరము. మెడిటేషన్‌లో కొంతమంది దేహమును పైకి లేపుతారు, ఎందువల్ల? ఈ పంచభూతములు దానిలో లేవు. దానివల్లే తేలిక అయిపోయింది. సైంటిస్టులు సరిగా కనుక్కోటం లేదు. ఈ మూత వుంది, పేకి విడుస్తే వచ్చి పడిపోతుంది. దూది విడుస్తే పైకి పోతుంది. అది తేలిక. లైట్‌గా వున్నది హైట్‌కి పోతుంది. బరువుగా వున్నప్పుడు క్రిందపడిపోతుంది. మన మన కోరికల బరువు ఎక్కువయ్యేకొద్దీ మనం క్రింద పడిపోతున్నాము. మన కోరికలు తగ్గించుకున్నప్పుడు తేలికై ఉన్నత స్థాయికి పోతుంది.

పిల్లలు రేపటినుండి ట్రై చేయండి. మీకు ఎన్ని కోరికలున్నాయో చెప్పలేము. కోరికలకు లిమిట్ లేదు. అప్పటికప్పుడు వచ్చే కోరికలు నిత్యజీవితంలోప్రత్యేకంగా వుంటాయి. ఉదయమునే లేచి గంజి త్రాగుతున్నావు. కాఫీ, టీ త్రాగి, తరువాత టిఫిన్ తీసుకుంటున్నావు. తరువాత భోజనము, రాత్రి భోజనము. ఇవన్నీకాక మధ్యమధ్య బిస్కట్లు అవీ తీసుకుంటున్నావు. ఇన్ని కోరికలు నీలో వుంటున్నాయి. దినమునకు ఐదు పర్యాయములు కాఫీ త్రాగుతున్నావు. కొంతమంది దినమునకు ఏభై సిగరెట్లు కాలుస్తారు. ప్రత్యక్షంగా ఫలితం రావాలంటే కోరికలు తగ్గించండి. ఈనాడు ఐదు సార్లే కాఫీ త్రాగుతున్నావు. రేపటినుండి మూడుతూర్లే తీసుకో. తగ్గించు. మెమరీ పవర్ పెరుగుతుంది. కోరికలు తగ్గించే కొలదీ ఇచ్ఛాశక్తి అధికమవుతుంది. ఇచ్ఛాశక్తిని మనమీనాడు కోల్పోతున్నాము. ఇచ్ఛాశక్తిని కోల్పోవటంచేత క్రియాశక్తిలో నీవు అపజయం పొందుతున్నావు. అందువల్ల జ్ఞానశక్తి క్షీణిస్తున్నది. ఆ విల్‌పవర్ అనేది విల్‌పైనే వుండాలి. ఆ విల్ ఎక్కడుంది? మానవులలో ఫ్రీవిల్ వుండటానికే వీలులేదు. ఏదైనా కార్యము చేయాలనుకున్నావు. కానీ, ఫ్రీవిల్ లేకపోతే ఇది ఏమవుతుందో, ఫలిస్తుందో లేదో అని డౌటు వస్తుంది. కనుక, ఫ్రీవిల్ అనేది లేదు. ఏదైనా ఇంకోదానిపై ఆధారపడి వుంటాయి. ఇప్పుడిక్కడ కూర్చున్నావు. పరుగెత్తి బయటకు పోవాలనుకున్నావు. నీకు అడ్డమున్నవాళ్ళను తప్పించుకు పోవాలికదా' కనుక, అది నీకు అడ్డు. ఏ సంకల్పానికిగాని, ఏ కార్యమునకుగాని ఫ్రీ అనేది లేనేలేదు. అనేకరకములైన అడ్డులు చేరిపోతాయి. భగవంతునికొక్కనికే ఈ ఫ్రీవిల్ అనేది వుంది. ఇంకెవరికీ లేదు. నీవు భ్రమిస్తున్నావు ఫ్రీవిల్ వుందని. నా ఇష్టము వచ్చినట్లు ప్రవర్తిస్తానని. అది ఫ్రీవిల్ కానేకాదు. అది నీ డిజైర్‌యొక్క లక్షణము. కనుక, ఫ్రీవిల్ అనేది ఒక్క

దైవానుగ్రహం చేతనే మనం పొందటానికి వీలవుతుంది. ఫ్రీ అంటే ఏమిటి? స్వాతంత్ర్యము. independent. in-dependent. ఇతరులపైన depend అవటమే. ఆత్మతత్త్వమే స్వాతంత్ర్యము. బాహ్యంగా దేహముతో, మనస్సుతో, బుద్ధితో కూడినది స్వాతంత్ర్యము కానేకాదు. అది స్వతంత్రము. భౌతికమైన జగత్తులో కొంతవరకు స్వతంత్రం వుండవచ్చును. కాని, ఏనిముషంలో ఎప్పుడు ఎక్కడ ఏవిధంగా జరుగుతుందో. ఒక చిన్న ఉదాహరణ. 'రెండవ తేదీ ఫిబ్రవరి సింహగర్జన చేస్తాను విజయవాడలో' అన్నాడు రామారావు. రాత్రి రెండుగంటలకు మరణించాడు. ఇదంతా ఎక్కడుంది? ఇది వారి చేతిలో వుందా? కేవలం ఒక్క దైవముతోనే వుంది. ఎవరికీ ఏవిదంగా అర్థంకాదు. మనం అనుకుంటాం యిదంతా స్వతంత్రం. ఈ పని చేయవచ్చునని. కానీ ఫలితం నీ చేతిలో లేదు. దైవంయొక్క చేతిలో వుంది. జయాపజయములు దైవాధీనములు.

విద్యార్థులారా! ఆధ్యాత్మిక మార్గములో దీనిని ఎంతైనా అర్థము చేసుకొని, దివ్యత్వమును స్మరించి, ఈ లౌకికత్వాని క్రమక్రమేణా కొంతవరకైనా విస్మరించి దైవత్వాన్ని సమీపించే మార్గాన్ని మీరు మీ విద్యతోబాటు చూచుకోండి. దీనిని వదలమని నేను చెప్పను. అయితే పవిత్రమైన మార్గములో హింస లేకుండా, అసత్యము లేకుండా. బ్రహ్మచర్యమునకు లోటు కలగకుండా, ఇతరుల వస్తువులను అపహరించుండా, ఇలాంటివి మన నిత్యజీవితములో సులభంగా అనుసరించేవి, చేయగల్గితే చాలు. ఎవరిదీ మనం దొంగిలించకూడదు. నీకు అవసరమైతే అడిగి తీసుకో. కొంతవరకు తప్పులేదు. అదికూడా తప్పే. అంత పెద్ద తప్పుకాదు. ఇంకా చాలా మంది పిల్లలు తెలియక చిన్నచిన్న వాటిలో ప్రవేశిస్తున్నారు. తరువాత యిది పెరిగిపోయి పెద్ద వృక్షమైపోతుంది. పెరిగిపోయాక దీనిని ఎవరూ ఏమీ చేయటానికి వీలుకాదు. చిన్నమొక్కగానే దానిని త్రుంచివేయాలి. ఇది ఈనాడు పిల్లలు నేర్చుకోవలసిన విషయాలు. మీ విద్యలెంత శ్రద్ధాభక్తులతో నేర్చుకుంటున్నారో ఆ శ్రద్ధాభక్తి ఈ ఆధ్యాత్మికములోకూడా ప్రవేశపెట్టండి. ఇవన్నీ మనకు కొంతకాలము మాత్రమే పనికివస్తాయి. రిటైరు అయ్యాక ఏమి వస్తుంది? చదివేది ఒకటి, మనం పనిచేసేది మరొకటి. 'నేను బి.కాం. ప్యాసయ్యాను. ఎంప్లాయిమెంటు ఆఫీసుకు అప్లైచేశాను. ఒకటి రెండు సంవత్సరములైనా నో రిప్లై'. ఏమి చేస్తున్నావు ఆఖరికి, ఏ పోలీసుగానో చేరిపోతున్నావు. నీవు చదివింది వేరు. చేసే పోలీసు ఉద్యోగం వేరు. పోలీసు ఉద్యోగం కోసం నీవు ఇంత శ్రమ ఎందుకు పడాలి? ఒకదానికొకటి సంబంధము లేకుండా జరుగుతుంది. ప్రపంచజ్ఞానమే అవసరము. అంతేగాని దీనితో యిది పొందుతామని చెప్పటానికి వీలులేదు. జీవిత పరమావధి చాలా ముఖ్యం. అదే దైవత్వం. అట్టి ప్రేమతత్త్వాన్ని మన హృదయంలోనుండి ఆవిర్భవింపచేసుకోవాలి.

ఒక్క భగవంతుని అనుగ్రహం వుంటే ఎన్నైనా సాధించవచ్చు. మీరు చూచారు, మొన్న గోరాకుంబారు. కుమారుని ప్రేమ వుంది. ఆమె బయట వున్నప్పుడు ఆ కుమారునకు ఎన్నో బోధలు చేస్తున్నాడు. 'నాయనా! నీవు నామస్మరణ చేయి. ఇదే నీకు ఉపయోగించేది. ఇదే నీ జన్మదినమున ఇచ్చే కానుక' అని ఎన్నో చెబుతూ వచ్చాడు. పిల్లవాడంటే చాలా ప్రేమ. కాని, మట్టి తొక్కుతున్న సమయంలో ఆ పిల్లవాడు మట్టిలో ప్రవేశించాడు. రంగారంగా అని తన దేహాన్ని తాను మరచిపోయాడు. ఇంక పిల్లవాడెక్కడ జ్ఞాపకము వస్తాడు? ఆయొక్క దీనిలో పిల్లవానిని చంపివేసుకున్నాడు. తరువాత బాధపడ్డాడు. అది పశ్చాత్తాపము. విచారించటమే. అప్పటినుండి అతనిలో మార్పు కలిగింది. ఇచ్చినవాడు తానే పుచ్చుకున్నవాడూ తానే. ఇది నేను నా చేతితో చేసినది కాదు. వాని ప్రాణం నా చేతిలో లేదు. నేను తెలిసి చేయలేదు. ఇది తెలియక చేసింది. ఇదంతా దైవేచ్ఛ అని అనుకున్నాడు. అప్పుడొక ప్రామిస్ చేశాడు. 'కన్న కుమారుని చంపుకున్నవాడను. ఇంక ఈ ప్రపంచముతో నాకు సంబంధము లేదు. ఈ దినం నుండి నేను నిన్ను టచ్ చేయను. నీకూ నాకు సంబంధము లేదు. నీవు భార్యగా నేను భర్తగా వచ్చాము. ఇదంతా భగవంతుని నిర్ణయమే. నీ జీవితం నీవు గడుపుకో. నా జీవితం నేను గడుపుతాను. లేక ఇద్దరం కలసి భగవచ్చింతనలో జీవితం గడుపుదాం' అన్నాడు భార్యతో. కాని, భార్య అంగీకరించలేదు. ఈమె అర్థాంగి. వంశోద్ధారకుడు ఒక్కడైనా కుమారుడు వుండాలని, పోనీ తనను టచ్ చేయకపోతే ఇంకో వివాహమైనా చేసుకోమని చెప్పింది. దానికి పూర్వం ప్రామిస్ చేశాడు,' నిన్ను టచ్ చేయకుండా నీవు కోరినటువంటివి అన్నీ నేను నెరవేరుస్తాను' అన్నాడు. ఆ పాయంటు పట్టుకుంది భార్య. 'నన్ను టచ్ చేయవద్దు. ఇంకొకరిని వివాహమాడి వంశోద్ధారకుని ప్రసాదించు' అంది. ఆమెకు మాట యిచ్చాడు. తప్పించుకునేందుకు వీలులేదు. ఆమె మాట ప్రకారం వివాహం చేసుకున్నాడు. కానీ, నీకూనాకు సంబంధము లేదుపొమ్మన్నాడు. ఇచ్చిన ప్రామిస్ సరిగా నిలబెట్టుకోలేకపోయాడు. యోచన చేశాడు. ప్రామిస్ చేసిన చేతులివి. ఈ చేతులతో యిచ్చిన ప్రామిస్‌ని దక్కించుకోలేని ఈ చేతులెందుకని కత్తి తెచ్చి నరికేసుకున్నాడు. భగవచ్చింతన తప్ప అన్యము లేదనుకున్నాడు. కాని, హృదయాన్ని ఎరిగినవాడు భగవంతుడు. కనుక, తక్షణమే ఒక brother-in-law మాదిరి వచ్చి ఆ చేతులకు కట్టు కట్టాడు. తన పనిమనిషిగా భావిస్తూ వచ్చాడు. రంగా, రంగా అని పనిమనిషిగా పిలిచాడు. పిల్లవాడు పోయిన మొదలు తల్లి ఏడుస్తున్నాది. చేతులు లేని భర్త ఈ స్థితిలో వున్నాడు. ఇంట్లో పనిచేసేవారు ఎవరూ లేరు. కనుక, ఆయనే ఇంట్లో వంట చేయటము. ఈవిధంగా కాలము గడుపుతూ వచ్చాడు. ఎవరతను? ఆ పాండురంగడే! దైవమే! తానే వచ్చి అన్నీ చేస్తున్నాడు. ఒకానొకదినము పాండురంగడు, రుక్మిణి యిద్దరూ వంటగదిలో మాట్లాడుతున్నారు. ఎవరో ఆడవారు మాట్లాడుతున్నారే, వాళ్ల చుట్టం వచ్చినట్లున్నదని అక్కతో చెప్పింది. తరిగి చూచేటప్పటికి ఆమె లేదు. అంతర్ధానమైపోయింది. దర్శనమునకు కూడా టైము రావాలి.

భక్తులకు ఒక టైము రావాలి. దర్శన, స్పర్శన, సంభాషణలంతా అంత సులభం కాదు. కనుకనే, అంతకాలం వాళ్ళు వేచి వుండేవారు. ఇంటిలోనే తిరుగుతున్నారు. కాని, వారు దైవస్వరూపులని వీరు గుర్తించలేదు. పండరీపురం వెళ్ళారు. అక్కడ పాండురంగడు ప్రత్యక్షమై, 'నాయనా! నీ మనస్సు పరీక్షించే నిమిత్తమై ఇన్నిరకములైన శిక్షలిచ్చాను. నీ మాటను నీవు దక్కించుకున్నావు. ఇదిగో నీ మరణించిన కుమారుడు'అని యిచ్చాడు. వారినందరినీ తనలోనే చేర్చుకున్నాడు. కట్టకడపటికి ఈ గోరాకుంభార్ మనోభీష్టాన్ని నెరవేర్చాడు. దర్శన, స్పర్శన, సంభాషణలంటే ఒక టైము రావాలి.

ఋషులందరూ భగవద్దర్శనంకోసం కృతయుగంలో ప్రయత్నంచేస్తూ వచ్చారు. కాని, కృతయుగంలో దైవస్వరూపం లేదు. 'తస్మైనమః కర్మణే' అని కర్మకు నమస్కారం చేసేవారు. ఒకనాడు దర్శనమిచ్చాడు. ఋషులు చూచారు. అప్పుడు వారు ప్రపంచమునకు చాటుతూ వచ్చారు. మేము చూచాము భగవంతుని. తమస్సుకు ఆవల వున్నాడు. సూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. కోటి సూర్యుల కాంతితో వున్నాడు. అతనిని మేము బయటకాదు లోపల చూచాము. దర్శనం చేసుకున్నారు. తరువాత భగవంతుని ప్రార్థించారు. 'స్వామీ! దర్శనం చేసుకున్నాము. కాని, నీయొక్క సంభాషణ లభ్యము కాలేదే'. 'నాయనా! ఈ యుగంలో కాదు. త్రేతాయుగంలో మీకు సంభాషణ యిస్తానన్నాడు. సంభాషణకు ఒక యుగం గడచిపోయింది. ఋషులందరూ వానరులుగా పుట్టారు. అప్పుడు శ్రీరామునిగా పుట్టాడు. అప్పుడు కోతులతో మాట్లాడుతూ వచ్చాడు. రాముడు ఒకచోట కూర్చున్నాడు. వీరంతా మరొకచోట కూర్చున్నారు. దానికి దీనికి భేదం చెప్పాడు. నాయనా! మీరు వానరులుగా వున్నంతకాలం నరరూపంలోనున్న నన్ను స్పృశించటానికి వీలుకాదు. ఎందుకంటే నేను నర, మీరు వానర. వాలముంది మీకు. నాకు వాలము లేదు. వాలమంటే ఏమిటి? కోరికలు. వాటిని మీరు తగ్గించుకుంటే కానీ నా స్పర్శ చిక్కదు. నాపై మీరు పరిపూర్ణమైన concentration చేయాలి. మీకు ద్వాపరయుగంలో స్పర్శ యిస్తానన్నాడు. ద్వాపరయుగంలో ఈ కోతులే గోపికలుగా కృష్ణుని స్మరించుకుంటూ వచ్చారు. భగవత్ నియమాలు చాలా వుంటున్నాయి. ఇది మీరు ఆశించిన తక్షణమే లభించదు.

త్రేతాయుగంలో రాక్షసులు ఒకచోట దేవతలు మరొకచోట వున్నారు. అయోధ్యలో, కిష్కింధలో దేవతలున్నారు. దండకారణ్యములో రాక్షసులున్నారు. ఒక్కొక్క దేశంలో వున్నారు. రాక్షసులను చంపటానికి స్వయముగా రాముడే సిద్ధమయ్యాడు. తాను ప్రత్యేకంగా వున్నాడు. వారితో యుద్ధము చేసి ఆ రాక్షసులను సంహరించాడు. ద్వాపరయుగంలో అంతా ఒక గృహంలోనే వున్నారు. మేనమామ కంసుడు రాక్షసుడు. మేనత్త కుమారుడైన శిశుపాలుడు, దంతవక్త్రుడు రాక్షసులు. ఇంకా అత్త కుమారులే కౌరవులు. వీరంతా రాక్షసులు. పాండవులు దేవతలు. వీరంతా ఒక ఇంటిలో వున్నారు. ఒక ఇంటిలో వుండటం వలన రాక్షసులకు సైన్యాన్ని యిచ్చాడు. దేవతలకు, అస్త్రములు విసర్జించి కేవలం సాక్షీభూతంగా వుంటానన్నాడు. సారథిగా మాత్రమే వుంటానన్నాడు. యుద్ధం చేయలేదు తాను. ఈ కలియుగం వచ్చేసరికి ఏమైంది? వారు ఒకే దేహములో వున్నారు. ఒక నిముషంలో దుర్గుణాలు, ఒక నిముషంలో సద్గుణాలు. ఒక నిముషములో సన్మార్గము. ఒక నిముషంలో దుర్మార్గము. ఎప్పుడు మంచి అవుతాడో ఎప్పుడు చెడ్డ అవుతాడో, ఎప్పుడు దేవుడౌతాడో, ఎప్పుడు వానరుడౌతాడో చెప్పటానికే వీలులేదు. అందువల్ల కలియుగంలో దేవుడు ఏమిచేశాడు? ఆ బాధ్యత వానికే యిచ్చాడు. నిన్ను నీవే శిక్షించుకోవాలి. నిన్ను నీవే రక్షించుకోవాలి. నేను సాక్షీభూతుడు నీలో ఆత్మగా వుంటున్నాను. కనుక, మానవుడు తన దోషాన్ని తానే గుర్తించుకొని తీసివేయటానికి తానే ప్రయత్నించాలి. ఎందుకంటే యిద్దరు ఒకే దేహంలో వున్నారు. ఈ బాధ్యత వానికే అప్పజెప్పారు. మంచి చెడులు రెండూ మన కర్మల ద్వారా లభ్యమవుతున్నాయి. కొత్త సంవత్సరము వచ్చింది. ఏ వార్త తెలుస్తుందోనని నీవు ఆశిస్తున్నావు. మన మంచిచెడ్డలు సంవత్సరము తీసుకొని రావటం లేదు. మన మంచిచెడ్డలు మనమే తీసుకుంటున్నాము. మన ప్రవర్తనే మన మంచిచెడ్డగా రూపొందుతాయి. మన మంచిచెడ్డలు మనమే నిర్ణయించుకోవాలి. మంచిని పోషించుకోవాలి. చెడ్డను విసర్జించాలి.

దైవరహస్యాలు చాలా వుంటున్నాయి. దానిని గుర్తించుకొనలేక స్వామి ఎందుకిలా చేస్తారని, స్వామి మాతో మాట్లాడటం లేదే అని అనుకుంటున్నారు. ఒక్కొక్క దానికి ఒక్కొక్క రహస్యం వుంటుంది. ఇవన్నీ నీలో నున్న మంచిచెడ్డలేగానీ భగవంతుని దోషంకాదు. ప్రతిదానికి మనలో విచారణ చేయాలి. అదే self enquiry.

విద్యార్థులారా! ఎవరిపై ఏ ద్వేషము మీరు పెంచుకోవద్దు. మొట్టమొదట మీదిమీరు విచారించుకోండి. ఏవిధమైన భావంతో వున్నాం మనం యిక్కడ. ముందు ఒకవిధముగా వెనుక ఒకవిధంగా వుండకూడదు. మన ప్రాముఖ్యం మనం నిలబెట్టుకోవాలి. ప్రాణం పోయినా సరే నిలబెట్టుకోవాలి. మార్గం ఒక్కటే దివ్యమైన మార్గములో మీరు ప్రవేశించండి. యావత్ప్రపంచమునకే మీరు లీడర్సుగా తయరౌతారు. మన విద్యార్థులు అలాంటి లీడర్సుగా తయారవాలని మీమీదే కొండంత ఆశ పెట్టుకొన్నాను. తల్లితండ్రులను సరైనరీతిగా గౌరవించాలి. సమాజమునకు తగిన సత్యాన్ని నిరూపించాలి. దేశానికే ఈవిధమైన ఆదర్శమును నిరూపించాలి. అలాంటి పిల్లలు తయారవాలని నేను నా కాలములో మూడువంతులు వారికే యిస్తున్నాను. కాని, పిల్లలు దీనిని అర్థం చేసుకోటం లేదు. తన స్వార్థం స్వప్రయోజనం గుర్తిస్తూపోతున్నాడు. కాదుకాదు. విశాలం, విశాలం. స్వామి చెప్పిన పనులు చేయండి. మంచి పేరు తెచ్చుకోండి. విద్యలో మంచి ఉత్తీర్ణులు కండి. విద్యలో మంచి ఉత్తీర్ణులు కండి. బయట

ప్రపంచమునకు ఆదర్శమును నిరూపించండి. ఇంతకాలము మన విద్యా సంస్థలో వున్నందుకు ఫలాన శ్రీసత్యసాయి విద్యాసంస్థ విద్యార్థి అనే పేరును నిలుపుకోండి. ఆ పేరు నిల్పుకోటమే స్వామికి యివ్వవలసిన కృతజ్ఞత. నేను మిమ్మల్ని ఏమీ కోరటం లేదు. పిల్లలు చెప్పారు. మాకు చొక్కా యిచ్చారు, సోప్ యిచ్చారు. ఇలా అన్నీ నేను యివ్వటం కాదు. ఇదికాదు ముఖ్యం. మంచి బుద్ధి యిచ్చాడని తెలుసుకోండి. మంచి మనస్సుని జాగ్రత్త చేసుకోండి. God mind ని డెవలప్ చేసుకోండి. ఈ రెండింటినీ మీరు డెవలప్ చేసుకుంటే దీనికి మించిన చదువు మరొకటి లేదు.